సాక్షి
మహబూబ్‌నగర్
శుక్రవారం । 9 । ఫిబ్రవరి । 2024





**తరలిపోతున్న ఇసుక**

రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని తుంగభద్ర నదిలో ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు.

వివరాలు 8లో ▸



**ఆలోచనలకు పదును**

విద్యార్థులను యువ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు విద్యాశాఖ కృషి చేస్తోంది.

వివరాలు 10లో ▸

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం
38.0 /17.4

ఆకాశం చాలా వరకు మేఘావృతమై ఉంటుంది. ఉదయం, రాత్రి చల్లని గాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఎండ ఉంటుంది.

## న్యూస్‌రీల్

### 36కు చేరిన పాజిటివ్ బాధితులు

పాలమూరు: జిల్లా జనరల్ ఆస్పత్రిలో గురువారం మొత్తం 44 మంది అనుమానితులకు ఆర్టీపీసీఆర్ పరీక్షలు చేయగా.. ఇందులో ఒకరికి పాజిటివ్ వచ్చింది. జనరల్ ఆస్పత్రిలో రెండు శాంపిల్స్, ఆరోగ్య శాఖ నుంచి 15, నారాయణపేట జిల్లా నుంచి 27 శాంపిల్స్ సేకరించి మెడికల్ కళాశాల ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించారు. ఇక మెడికల్ కళాశాల ల్యాబ్‌లో ఇప్పటి వరకు 2,484 మంది అనుమానితులకు చేసిన ఆర్టీపీసీఆర్ పరీక్షలలో 36 మందికి పాజిటివ్ వచ్చింది. ఇందులో అందరూ పాజిటివ్ బాధితులు హోం ఐసోలేషన్‌లో ఉంటూ చికిత్స పొందారు. అయితే వీరిలో కొంత మందికి ఇప్పటికే హోం ఐసోలేషన్ పూర్తి కావడం విశేషం.

### రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతగా నిలవాలి



మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో విజేతగా నిలవాలని జిల్లా ఖోఖో సంఘం కార్యదర్శి విలియం అన్నారు. యాదాద్రి భువనగిరిలో శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే రాష్ట్రస్థాయి సీనియర్ ఖోఖో టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా పురుష, బాలికల జట్లు గురువారం తరలివెళ్లాయి. ఈ సందర్భంగా జిల్లాకేంద్రంలోని మాడ్రన్ స్కూల్ పాఠశాల ఆవరణలో జిల్లా ఖోఖో జట్లను విలియం తదితరులు అభినందించారు. రాష్ట్రస్థాయిలో మెరుగైన ప్రతిభ కనబరిచాలని కోరారు. జిల్లా ఖోఖో క్రీడాకారులు జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జట్లకు కోచ్, మేనేజర్లుగా కృష్ణవేణి, చక్రవర్తి, వెంకటేశ్, కృష్ణ వ్యవహరిస్తారన్నారు. హెచ్‌ఎం దత్తురావు క్రీడాజట్లను అభినందించారు. కార్యక్రమంలో సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి బాలరాజు, పీఈటీలు మొగులాల్, సామరమేశ్ పాల్గొన్నారు.

### 11న సబ్ జూనియర్ కబడ్డీ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఈ నెల 11న జిల్లా సబ్ జూనియర్ బాల, బాలికల కబడ్డీ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శాంతికుమార్, కురుమూర్తిగౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచి ఎంపికలు జరుగుతాయని, ఎంపికై న జట్లు సూర్యాపేట జిల్లా చింతలపాలెంలో ఈ నెల 16 నుంచి 19 వరకు జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొంటారని చెప్పారు. క్రీడాకారులు ఆధార్ కార్డుతో ఎంపికలకు హాజరుకావాలని వారు కోరారు.

### గురుకుల ఉమ్మడి ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లావ్యాప్తంగా ఈనెల 11న జరిగే ఐదో తరగతిలో గురుకుల ఉమ్మడి ప్రవేశ పరీక్షకు పది కేంద్రాలను ఏర్పాటు చేశామని అదనపు కలెక్టర్ మోహన్‌రావు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆయా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. జిల్లాలోని సాంఘిక సంక్షేమ గిరిజన, బీసీ, జనరల్ గురుకుల పాఠశాలల్లో చేరేందుకు 3,771 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ పరీక్ష కొనసాగుతుందన్నారు. ఉదయం పది గంటల వరకు ఆయా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా సమన్వయ అధికారి వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

### మహిళకు సీపీఆర్ చేసి కాపాడిన పోలీసులు

మహబూబ్‌నగర్ క్రైం: రోడ్డు పక్కన అచేతనంగా పడి ఉన్న ఓ మహిళకు పోలీసులు సీపీఆర్ చేసి కాపాడారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. జిల్లాకేంద్రంలోని పాతపాలమూరుకు చెందిన యాదమ్మ గురువారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో మోడల్ బేసిక్ హైస్కూల్ పక్కనే రోడ్డుపై స్పృహ తప్పిపడిపోయింది. ఈ క్రమంలో బాంబు డిస్పోజల్ విధులు ముగించుకొని వస్తున్న ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ గోవర్ధన్, కానిస్టేబుల్ వెంకట్‌కుమార్, డాగ్‌స్క్వాడ్ సిబ్బంది రఘు, శివ మహిళను గమనించి సీపీఆర్ చేశారు. అనంతరం ప్రథమ చికిత్స నిమిత్తం ఆటోలో జనరల్ ఆస్పత్రికి తరలించారు. సకాలంలో స్పందించిన సిబ్బందిని ఎస్పీ హర్షవర్ధన్ అభినందించారు.

# నిధులొచ్చేనా..?!



రేగుమానుగడ్డ వద్ద అప్రోచ్ కెనాల్ హెడ్ రెగ్యులేటర్ (ఫైల్)

**చివరి దశలో ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులు**

- పాలమూరు– రంగారెడ్డికి రూ.1,400 కోట్లు, కేఎల్‌ఐకి రూ.400 కోట్లు
- గద్వాల జిల్లా ప్రాజెక్టులకు రూ.340 కోట్లు అవసరం
- ప్రతిపాదనలు పంపిన ఇరిగేషన్ శాఖ అధికారులు
- ప్రస్తుత బడ్జెట్‌లోనైనా నిధులు కేటాయించాలని వేడుకోలు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/ గద్వాల రూరల్: అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నెట్టెంపాడు, భీమా, కల్వకుర్తి ప్రాజెక్టులను చేపట్టారు. ఇవి పూర్తయితే సుమారు 12 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించవచ్చు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత జలయజ్ఞం కింద చేపట్టిన ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు అవసరమైన నిధులు విడుదల కాకపోవడంతో గత పదేళ్లుగా ఆయా పనులన్నీ అసంపూర్తిగా చివరి దశలో కొనసాగుతున్నాయి. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జలయజ్ఞం కింద చేపట్టిన ప్రాజెక్టులకు మొదటి ప్రాధాన్యత కల్పిస్తూ వాటిని పూర్తిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యోచిస్తున్నట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో సాగునీటి పారుదల శాఖ అధికారులు ప్రాజెక్టులకు అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించింది. దీంతో ప్రాజెక్టులకు నిధులు కేటాయింపులు చేస్తారనే ఆశలు రేకెత్తుతున్నాయి.

**గద్వాల జిల్లాలో జలయజ్ఞం కింద చేపట్టిన నెట్టెంపాడు ప్రాజెక్టు పనులు చివరి దశలో కొనసాగుతూ గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే గట్టు, తుమ్మిళ్ల ఎత్తిపోతల పనులు కొనసాగుతున్నాయి.** నెట్టెంపాడు ప్రాజెక్టుకు రూ.300 కోట్లు, గట్టు ఎత్తిపోతలకు రూ.260 కోట్లు, తుమ్మిళ్ల రూ.40 కోట్లు నిధులు కావాలని అధికారులు నివేదిక పంపారు. ఇందులో నెట్టెంపాడు, గట్టు ఎత్తిపోతలకు రూ.300 కోట్లు, తుమ్మిళ్లకు రూ.40 కోట్లు కేటాయించే అవకాశాలు ఉన్నాయి. నెట్టెంపాడు ప్రాజెక్టులో భూ సేకరణకు రూ.15 కోట్లు, నిర్మాణ పనులకు రూ.120 కోట్లు వెచ్చించనుండగా ఇందులో గతంలో చేసిన పనులకు సంబంధించి సుమారు రూ.5 కోట్ల వరకు ఉన్నాయి.

> **ప్రాధాన్యత క్రమంలో..**
>
> ప్రస్తుత బడ్జెట్‌లో పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతలకు రూ.1,400 కోట్లు, కల్వకుర్తి ఎత్తిపోతలకు రూ.400 కోట్లు కేటాయించనున్నారు. పాలమూరు– రంగారెడ్డి కింద 55 శాతం పనులు పూర్తయ్యాయి. వచ్చిన నిధులను భూ సేకరణతోపాటు నిర్మాణ పనులకు వినియోగిస్తాం. అలాగే కల్వకుర్తి ప్రాజెక్టులో రూ.100 కోట్లు భూ సేకరణకు, మిగిలిన రూ.300 కోట్లతో డిస్ట్రిబ్యూటరీ పనులు చేపట్టి వచ్చే ఏడాదికి 80 వేల ఎకరాల ఆయకట్టును కొత్తగా అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు చేపడుతున్నాం.
>
> – అహ్మద్‌ఖాన్, సీఈ పీఆర్‌ఎల్‌ఐ

- గట్టు ఎత్తిపోతల పథకంలో భూసేకరణకు రూ.15 కోట్లు, నిర్మాణ పనులు (పెండింగ్ బిల్లులు రూ.70 కోట్లు) రూ.150 కోట్లు వెచ్చించనున్నారు. గతేడాదిలో మొదలైన ఎత్తిపోతల పనులు ఇప్పటి వరకు 30 శాతానికి పైగా పూర్తి కాగా.. 535 ఎకరాలకు సంబంధించి భూ సేకరణ పరిహారం రూ.40 కోట్లు చెల్లింపులు చేశారు.



కొనసాగుతున్న గట్టు ఎత్తిపోతల పనులు

- జలయజ్ఞం కింద 5 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించేందుకు కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని చేపట్టగా పనులు చివరి దశలో కొనసాగుతూ గత 19 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. ఈసారి ఈ ప్రాజెక్టుకు రూ.400 కోట్లు కేటాయించే అవకాశం ఉండడంతో ఇందులో రూ.100 కోట్లు భూ సేకరణకు వినియోగించనుండగా.. మిగిలిన రూ.300 కోట్లతో పెండింగ్ బిల్లులు, అదేవిధంగా డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ నిర్మాణం పనులు చేపట్టన్నారు. వచ్చే ఏడాదికి ప్రస్తుతం ఇస్తున్న ఆయకట్టుకు అదనంగా మరో 80 వేల ఎకరాల ఆయకట్టును అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు ప్రణాళిక రూపొందించారు.
- తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకంలో భాగంగా మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మించనున్నారు. ఇందుకోసం 563 ఎకరాల భూమి అవసరం. ఈ పథకానికి సంబంధించి అధికారులు రూ.500 కోట్లతో ప్రభుత్వానికి నివేదించగా.. ఇందులో మొదటి విడతగా భూసేకరణ కోసం రూ.40 కోట్ల వరకు నిధులు కేటాయించే అవకాశాలున్నాయి. భూ సేకరణ పూర్తయిన వెంటనే రిజర్వాయర్ పనులు చేపడతామని అధికారులు చెబుతున్నారు. మొత్తం 1.02 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించనున్న దీనిని బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా ఉపయోగించనున్నారు.
- పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు ఇప్పటి వరకు 55 శాతం పూర్తి అయ్యాయి. తాజాగా ప్రాజెక్టుకు రూ.4 వేల కోట్ల నిధులు అవసరమున్నట్లు అధికారులు నివేదిక పంపారు. అయితే ఇందులో రూ.1,400 కోట్లు విడుదల చేసే అవకాశం ఉంది. వచ్చిన నిధుల్లో భూ సేకరణ, ఇప్పటికే పనులు చేసిన పెండింగ్ బిల్లులు, ఇతర వాటికి కేటాయించనున్నారు.

## వనపర్తిలో అత్యధికం..
# జడ్చర్లలో అత్యల్పం



- నూతన ఓటరు జాబితా విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాలల్లో 34,17,457 మంది ఓటర్లు

పాలమూరు: ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో నూతన ఓటరు జాబితాను గురువారం రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు విడుదల చేశారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తాజా ఓటరు జాబితాను అందుబాటులోకి తీసుకువచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాల్లో ఉన్న నియోజకవర్గాల్లో నూతన జాబితాను విడుదల చేయడం జరిగింది. జనవరి వరకు దరఖాస్తులు స్వీకరించిన అధికారులు కొత్త జాబితాను విడుదల చేశారు. అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే ప్రతి నియోజకవర్గంలో కొత్త ఓటర్ల సంఖ్య స్వల్పంగా పెరిగింది. కొత్తగా విడుదల చేసిన ఓటరు జాబితాలో మొత్తం ఓటర్లు 34,17,457 ఉండగా.. ఇందులో వనపర్తి నియోజకర్గంలో అత్యధిక ఓటర్లు 2,72,873 మంది ఉండగా.. అత్యల్పంగా జడ్చర్ల నియోజకవర్గంలో 2,23,481 మంది ఉన్నారు. ఇక ప్రతి నియోజకవర్గంలో మహిళ ఓటర్లు స్వల్పంగా ఎక్కువగా ఉండటం విశేషం.

| నియోజకవర్గం | పురుషులు | మహిళలు | ఇతరులు | సర్వీస్ ఓటర్లు | మొత్తం |
|---|---|---|---|---|---|
| కొడంగల్ | 1,19,237 | 1,23,020 | 10 | 164 | 2,42,431 |
| నారాయణపేట | 1,16,261 | 1,19,254 | 2 | 166 | 2,35,683 |
| మహబూబ్‌నగర్ | 1,28,268 | 1,30,377 | 13 | 323 | 2,58,981 |
| జడ్చర్ల | 1,11,354 | 1,11,863 | 5 | 259 | 2,23,481 |
| దేవరకద్ర | 1,18,372 | 120705 | 0 | 198 | 2,39,275 |
| మక్తల్ | 1,19,474 | 1,23,863 | 1 | 62 | 2,43,400 |
| వనపర్తి | 1,35,367 | 1,37,282 | 4 | 220 | 2,72,873 |
| గద్వాల | 1,25,356 | 1,30,499 | 11 | 39 | 2,55,905 |
| అలంపూర్ | 1,17,997 | 1,21,074 | 8 | 59 | 2,39,138 |
| నాగర్‌కర్నూల్ | 1,18,764 | 1,19,366 | 3 | 234 | 2,38,367 |
| అచ్చంపేట | 1,23,234 | 1,24,382 | 5 | 173 | 2,47,794 |
| కల్వకుర్తి | 1,22,805 | 1,20,148 | 9 | 135 | 2,43,097 |
| షాద్‌నగర్ | 1,99,114 | 1,19,211 | 13 | 54 | 2,38,392 |
| కొల్లాపూర్ | 1,20,511 | 1,17,943 | 5 | 181 | 2,38,640 |

# జనరల్ ఆస్పత్రిలో చిన్నారి కిడ్నాప్

మహబూబ్‌నగర్ క్రైం: జనరల్ ఆస్పత్రిలో నాలుగు నెలల చిన్నారికి చికిత్స కోసం తీసుకురాగా.. ఆస్పత్రి ఆవరణలో నిద్రపోయిన తల్లి ఒడి నుంచి గుర్తుతెలియని వ్యక్తులు చిన్నారిని అపహరించారు. టూటౌన్ ఎస్‌ఐ జిక్కిబాబు కథనం ప్రకారం.. అడ్డాకుల మండలం కందూర్‌కు చెందిన బోయ అంజమ్మ, ఆంజనేయులు దంపతులకు నాలుగు నెలల క్రితం ఆడశిశువు జన్మించింది. అయితే పుట్టిన శిశువుకు అనారోగ్య సమస్యలు ఉండటంతో మొదట హైదరాబాద్‌లో నిలోఫర్, ఉస్మానియా ఆస్పత్రుల్లో చూపించుకున్నారు. మళ్లీ అక్కడి నుంచి ఈ నెల 6న సాయంత్రం జనరల్ ఆస్పత్రికి వచ్చారు. తండ్రి ఆంజనేయులు వారిని ఆస్పత్రిలో ఉంచి కూలీపని కోసం స్వగ్రామం వెళ్లాడు. అయితే తల్లి అంజమ్మ నాలుగు నెలల చిన్నారితో కలిసి ఆస్పత్రిలోని ఓపీ కౌంటర్ ఆవరణలో పడుకుంది. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున తల్లి ఒడిలో నుంచి గుర్తుతెలియని వ్యక్తులు శిశువును ఎత్తుకెళ్లారు. అయితే శిశువును తీసుకెళ్తున్న సమయంలో ఆస్పత్రిలో కొందరు చూసినా తల్లిదండ్రులు అనుకొని ఎవరూ అడ్డుకోలేదు. ఈ ఘటనపై బాధితురాలు అంజమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ ఘటనపై ఆస్పత్రి సూపరింటెండెంట్ జీవన్‌ను వివరణ కోరగా వారు ఆస్పత్రిలో అడ్మిట్ కాలేదని, ఓపీ కౌంటర్ దగ్గర నిద్రించారని చెప్పారు. అయితే చిన్నారిని తీసుకువెళ్లిన ఘటనపై విచారణ చేస్తామన్నారు.



కిడ్నాప్‌నకు గురైన చిన్నారి తల్లిదండ్రులు

> **అమాయక తల్లిదండ్రులు**
>
> కిడ్నాప్‌నకు గురైన నాలుగు నెలల చిన్నారి తల్లిదండ్రులు ఇద్దరూ నిరక్షరాసులు. వీరికి చిన్నారి అదృశ్యంపై ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి. పోలీస్‌స్టేషన్‌కు రెండుసార్లు తిరిగినా పోలీసుల నుంచి సరైన స్పందన రాకపోవడంతో మళ్లీ జనరల్ ఆస్పత్రికి వచ్చి వాళ్ల ఆవేదన చెప్పుకొన్నారు. తర్వాత మళ్లీ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే చిన్నారి కిడ్నాప్ దృశ్యాలు ఎస్‌ఎంసీ కెమెరాలో రికార్డ్ అయ్యే అవకాశం ఉన్నా.. అవి పనిచేయడం లేదని తెలుస్తోంది.

# బీఆర్‌ఎస్ అవినీతిని ఎండగట్టాం



కొత్తకోటలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, ఏఐసీసీ నేత వంశీచంద్‌రెడ్డి తదితరులు

- బీఆర్‌ఎస్, బీజేపీ రెండూ ఒక్కటే
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

కొత్తకోట రూరల్: ప్రాజెక్టుల పేరుతో బీఆర్‌ఎస్ చేసిన అవినీతిని శ్వేతపత్రంలో ఎండగట్టామని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పాలమూరు న్యాయయాత్రలో భాగంగా వనపర్తి జిల్లా కొత్తకోటలో గురువారం కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి పొంగులేటి హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో పదేళ్లపాటు అధికారంలో ఉన్న కేసీఆర్ కృష్ణా పరివాహక ప్రాంతం నుంచి పాలమూరు జిల్లాలో ఏ ఒక్క ఎకరాకైనా నీళ్లు ఇచ్చారా.. అని ప్రశ్నించారు. పాలమూరు జిల్లాను పట్టించుకున్న ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ హయాంలో పాలమూరులో చేపట్టిన ప్రాజెక్టులు దాదాపు 90 శాతం పూర్తయ్యాయని, బీఆర్‌ఎస్ వచ్చిన తర్వాత కాల్వల్లో కంప, జమ్ము తొలగించి నీళ్లు పారించి పూలు జల్లి తామే అంతా చేశామని గొప్పలు చెప్పుకొన్నారని విమర్శించారు. మాయమాటలు చెప్పి రెండుసార్లు ముఖ్యమంత్రి అయిన కేసీఆర్ పాలమూరుకు చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. కార్యక్రమానికి వచ్చే ముందు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఏం మాట్లాడాలి అని అడిగితే.. దేవరకద్ర నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రి, మండలానికో 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేద్దామని చెప్పారన్నారు. ధరణి పేరుతో రైతుల భూములు లాక్కున్న వారి నుంచి తిరిగి తీసుకుని ప్రజలకు ఇస్తామన్నారు.

**పాలమూరును కాపాడేందుకే న్యాయయాత్ర**

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి చల్లా వంశీచందర్‌రెడ్డి మాట్లాడుతూ దేశాన్ని కాపాడేందుకు రాహుల్‌గాంధీ చేపడుతున్న 'భారత్ జోడో యాత్ర'ను ఆదర్శంగా తీసుకుని 'పాలమూరు న్యాయ యాత్ర' చేపట్టానన్నారు. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ తమపై నమ్మకంతో ప్రజలు ఓటు వేసి గెలిపించారని, రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబానికి న్యాయం జరిగేలా కృషిచేస్తామన్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందిస్తామన్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త, నాయకుడు పనిచేయాలని పిలుపునిచ్చారు.

**ప్రజలను మభ్యపెట్టారు**

రాజాపూర్: తెలంగాణ ఏర్పాటు తర్వాత అధికారం చేపట్టిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు రాష్ట్ర ప్రజలను మాయమాటలతో మభ్యపెట్టారు.. ఇప్పుడు అధికారం కోల్పోయి రెండు నెలలు కూడా పూర్తికాని కాంగ్రెస్ ప్రభుత్వంపై అక్కసు వెళ్లగక్కుతున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాజాపూర్ మండలం రంగారెడ్డిగూడలోని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి నివాసంలో ఆయన మాట్లాడుతూ పదేళ్ల పాటు అధికారంలో ఉండి కాలయాపన చేసింది మీరు కాదా అని విమర్శించారు. కృష్ణానది నీటిని ఎట్టి పరిస్థితుల్లో కేంద్రానికి అప్పజెప్పే ప్రసక్తే లేదన్నారు. ఇంకా వారే అధికారంలో ఉన్నట్లు భ్రమపడుతూ కాంగ్రెస్ పార్టీపై, ప్రభుత్వంపై నెట్టాలని చూడటం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. పాలమూరు బిడ్డ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక విజన్‌తో ముందుకు వెళ్తున్నారన్నారు. సమావేశంలో రంగారెడ్డిగూడ మాజీ సర్పంచ్‌లు జనంపల్లి శశికళారెడ్డి, దుష్యంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కందులు క్వింటా రూ.10,060



జడ్చర్ల/ దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం కందులకు అత్యధికంగా ధర లభించింది. క్వింటాలు గరిష్టంగా రూ.10,060, కనిష్టంగా రూ.9,619 ధర కేటాయించారు. అలాగే వేరుశనగ క్వింటాలు గరిష్టంగా రూ.7,239, కనిష్టంగా రూ.4,002, ఆర్‌ఎన్‌ఆర్ రకానికి రూ.3,159, మొక్కజొన్న రూ.2,101, ఆముదాలు గరిష్టంగా రూ.5,400, కనిష్టంగా రూ.5,380, పెబ్బర్లు రూ.7,482 చొప్పున పలికాయి.

**సోనామసూరి ధర రూ.2,950**

దేవరకద్ర మార్కెట్ యార్డులో గురువారం జరిగిన ఈనామ్ టెండర్లలో సోనామసూరి ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,950, కనిష్టంగా రూ.2,800 ధర లభించింది. అలాగే కందులకు గరిష్టంగా రూ.10,109, వేరుశనగకు గరిష్టంగా రూ.5,159 చొప్పున వచ్చాయి. ప్రస్తుతం మార్కెట్‌కు వేరుశనగతోపాటు సోనా, కందులు అమ్మకానికి వస్తున్నాయి.

# సమస్యలు పరిష్కరించకపోతే మళ్లీ ఉద్యమం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో బుధవారం చలో పీయూ కార్యక్రమంలో భాగంగా నిరసన చేపడితే వైస్ చాన్స్‌లర్ లేనిపోని మాటలు మాట్లాడుతున్నారని జిల్లా విభాగ్ కన్వీనర్ నరేష్‌తేజ అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిశీలించేందుకు ఏబీవీపీ సిద్ధమని.. ఇందుకు వీసీ సిద్ధమా అని ప్రశ్నించారు. డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో మొదటగా ప్రమోట్ అని వచ్చి తర్వాత డిటేండ్ వస్తున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అడ్మిషన్ ఫీజుల పేరిట డిగ్రీలో రూ.వేలకు వేలు వసూలు చేయడం నిజం కాదా.. రీవ్యాలువేషన్ ఫీజులు కట్టించుకున్నాక సరైన సమయానికి ఫలితాలు ఎప్పుడిచ్చారని ప్రశ్నించారు. సమస్యలపై నిలదీస్తే వీసీ తప్పుడు ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. సమస్యలను నెలరోజుల్లో పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో మరోసారి వేల సంఖ్యలో విద్యార్థులతో నిరసన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అర్జున్, కృష్ణ, జైపాల్, నీరేష్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

మహబూబ్‌నగర్ క్రైం: మెడికల్ విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం డీఎస్పీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఎస్పీ హర్షవర్ధన్ ఆదేశాల మేరకు జిల్లాకేంద్రంలోని ఎస్వీఎస్ వైద్య కళాశాలలో గురువారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాలు చూపే మోసపూరిత ఆశలకు, గిఫ్టులకు, తక్కువ ధరలకు వాహనాలు, వస్తువులు దొరుకుతాయని చెబితే నమ్మరాదన్నారు. ఏదైనా కస్టమర్ కేర్ నంబర్ సంబంధిత అధికార వెబ్‌సైట్ నుంచి తీసుకోవాలని, ఆన్‌లైన్ సెర్చ్ చేస్తే నకిలీ కస్టమర్ నంబర్లు వస్తాయన్నారు. కస్టమర్ కేర్ నుంచి లింక్ పంపిన తర్వాత ఓపెన్ చేయరాదని, బ్యాంకు వివరాలు ఇవ్వరాదన్నారు. ఆన్‌లైన్‌లో యాప్‌లు డౌన్‌లోడ్ చేసిన క్రమంలో చాలా జాగ్రత్తగా ఉండాలని, వ్యక్తిగత వివరాలతోపాటు ఫొటోలు సేకరించే అవకాశం ఉంటుందన్నారు. బ్యాంకుల నుంచి కేవైసీ, పాన్‌కార్డు అప్‌డేట్ కోసం ఎలాంటి మెసేజ్‌లు పంపరని, అనవసర లింక్‌లు, మెసేజ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కి సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ జోషి, సైబర్ క్రైం ఎస్‌ఐ గోపాల్, ఐటీ ఇన్‌చార్జ్ ఆర్‌ఎస్‌ఐ రవి, రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు హాజరైన ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, చిట్టెం పర్ణికారెడ్డి, మేఘారెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, వంశీకృష్ణ. అయితే గవర్నర్ ప్రసంగం సమయంలో ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఆయన తనయుడు ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి పక్కపక్కన కూర్చోవడం ఆకట్టుకుంది.

## క్లుప్తంగా

### రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

**అయిజ:** కర్నూలు వెళ్లే రోడ్డుపై రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. 108 వాహనం సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని పత్తికొండకు చెందిన గోవింద్‌గౌడ్ ద్విచక్రవాహనంపై కర్నూల్‌కు వెళ్తున్నాడు. జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలం లింగాపురానికి చెందిన జమ్మన్నగౌడ్ గ్రామానికి ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. మండలంలోని వెంకటాపురం–పర్దీపురం గ్రామాల మధ్య దర్గా సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. దీంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. అటువైపు వెళ్తున్న కొందరు 108కు సమాచారం ఇవ్వడంతో వారిని అంబులెన్స్ తీసుకెళ్లారు. ఇద్దరిని కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. 108 సిబ్బంది పైలెట్ శ్రీధర్, ఈఎంటీ ఇస్మాయిల్‌లు గోవింద్‌గౌడ్‌కు సంబంధించిన సెల్ ఫోన్, రూ.80 వేల నగదు బాధితునికి అందజేశారు. జమ్మన్న గౌడ్‌కు సంబంధించిన సెల్ ఫోన్‌తోపాటు రూ.30,500 నగదు వారి బంధువులకు అందజేశారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



శంకర్(ఫైల్)

**ఊట్కూరు:** మండలంలోని తిమ్మారెడ్డిపల్లి తండా శివారులోని హైదరాబాద్ రోడ్డుపై కారు ఢీకొని శంకర్(శివ)(18) గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణపేట మండలం, అప్పక్‌పల్లికి చెందిన శ్రీనివాసులు, అంజిలమ్మ కుమారుడు శంకర్ హైదరాబాద్ రోడ్డు వెంట ఉదయం రన్నింగ్ ప్రాక్టీస్ చేస్తుండేవాడు. వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం బలంగా ఢీకొట్టింది. దీంతో శంకర్ అక్కడికక్కడే మృతిచెందగా.. కారు నిలుపకుండా పారిపోయాడు. వెంటనే స్థానికులు గమనించి పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. యువకుడు నారాయణపేటలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ గోకరి తెలియజేశారు.

### వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

**బాలానగర్:** వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని జాతీయరహదారి–44పై బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ తిరుపాజీ తెలిపిన వివరాలు ఇలా.. బుధవారం రాత్రి బెంగుళూర్ వైపు నుంచి హైదరాబాద్ వైపుగా వెళ్తున్న గుర్తు తెలియని వాహనం బాలానగర్ శివారులో గుర్తు తెలియని వ్యక్తి (35–40) వ్యక్తిని ఢీకొనడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంబంధించిన వారు ఎవరైనా ఉంటే బాలానగర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

### తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని ఆత్మహత్య

**నాగర్‌కర్నూల్ క్రైం:** మద్యం తాగేందుకు భార్య డబ్బులు ఇవ్వలేదని భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని నల్లవెల్లిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ గోవర్దన్ తెలిపిన వివరాలిలా.. నల్లవెల్లికి చెందిన తిరుపతయ్య (51) తన భార్య మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని క్షణికావేశంలో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి కుమారుడు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

### చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

**నాగర్‌కర్నూల్ క్రైం:** పురుగు మందు సేవించిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ గోవర్దన్ వివరాలిలా గగ్గలపల్లికి చెందిన బాలస్వామి(70) దేశిటిక్యాలలో ప్రతాప్‌రెడ్డి వద్ద కూలీ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బాలస్వామి వ్యక్తిగత కారణాలతో ఈనెల 4న దేశిటిక్యాలలో వ్యవసాయపొలం వద్ద పురుగు మందు తాగాడు. గమనించిన ప్రతాప్‌రెడ్డి గమనించి జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి తరలించారు. వారం రోజులుగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడి కూతురు శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

# తరలిపోతున్న ఇసుక!



కొల్లగొట్టిన ఇసుక సంపద

- తుంగభద్రనదిలో రాత్రి వేళల్లో కొల్లగొడుతున్న ఇసుక మాఫియా
- రాయలసీమలో కాసుల కురిపిస్తున్న వైనం
- కేసులు చేస్తున్న బేఖాతరు
- అడుగంటుతున్న భూగర్భ జలాలు



అలంపూర్ పోలీస్ స్టేషన్‌లో ఇసుక ట్రాక్టర్లు

**అలంపూర్ రూరల్:** తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన శింగవరం, ర్యాలంపాడ్ శివారులో గల తుంగభద్ర నది వద్ద వెలిసిన ఇసుకను తవ్వేస్తున్నారు. అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో సరిహద్దు కర్నూల్ చెందిన వారికి గ్రామలలోని కొంత మంది సాయంతో ఇసుకను అర్ధరాత్రి వేళలో తరలించుకుపోతున్నారు. దీన్ని రాయలసీమ ప్రాంతంలో అమ్ముకుంటున్నారు.

**తుంగభద్ర ఇసుకకు ఫుల్ డిమాండ్**

ఇళ్ల ప్లాస్టరింగ్‌కు కావాల్సిన అతి మెత్తని, సన్నగా ఉన్న ఇసుకకు ఎక్కువగా డిమాండ్ ఉంటుంది. ఎక్కడ లేని విధంగా జల్లెడ పట్టాల్సిన అవసరం కూడా లేకుండా ఇసుక ఇక్కడ లభ్యం కావడంతో తుంగభద్ర ఇసుకకు డిమాండ్ ఏర్పడింది. ఇలాంటి ఇసుక రాయలసీమకు ప్రారంభమయ్యే చోటు గల శింగవరం, ర్యాలంపాడ్ శివారులో ఉన్నది. రాత్రి అయ్యిందంటే చాలు నదిలో సెలసెల పారే నీటి చప్పుళ్ల కన్న ట్రాక్టర్ల మోతతో భీకరమైన శబ్దాలు ఆ ప్రాంతంలో మారుమోగుతున్నాయి. 50 నుంచి 60 దాక ట్రాక్టర్లతో వంద మందికి పైగా కూలీలతో ఇసుకను తీసుకెళ్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు బహిరంగంగా చెబుతున్నారు. నదిలోని ఇసుకను తరలించుకుపోతుండడంతో భూగర్భ జలాలు అడుగంటి, చేతి పంపులకు నీళ్లు రావడం లేదు. ఓ వైపు అప్పుడప్పుడు కేసులు నమోదు చేస్తున్నా.. ఏ మాత్రం ఖాతు చేయకుండా ఇసుక దందా యథేచ్చగా కొనసాగిస్తున్నారు.

**స్థానికులకు అందని వైనం**

అన్ని ఉన్న అల్లుడి నోట్లో శని అన్న చందంగా అలంపూర్ స్థానికులకు చుట్టూ నదిలో ఇసుక ఉన్నా అందని ద్రాక్షలా మారింది. అలంపూర్ పట్టణానికి దగ్గరలో ఉన్న ఇసుక తీసుకునేందుకు లక్ష కారణాలను అధికారులు చెబుతూ ఆన్‌లైన్ అని, ఇసుకకు అనుమతులు కావాలని దాటేస్తున్నారు. కాని ఇక్కడ ఇసుక మాఫియా వారికి మాత్రం ఎలాంటి అనుమతులు లేకుండా వందల ట్రాక్టర్ల ఇసుకను తరలించుకుపోతున్నారు.

**కేసులు నమోదు చేస్తున్నాం**

అనుమతి లేకుండా ఇసుకను తరలించకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. మా పోలిస్ సిబ్బంది ఎప్పటికప్పుడు నదితీర ప్రాంతాలలో తిరుగుతున్నారు. ఆన్‌లైన్ లేకుండా అక్రమంగా ఎక్కడైన ఇసుకను తరిలిస్తే పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నాం. ఇసుకను అక్రమంగా తరలిస్తే చట్టపరమైనా చర్యలు తీసుకుంటాం.

– ఏ.నాగరాజు, ఎస్‌ఐ, అలంపూర్

## భారీ స్థాయిలో ఇసుక డంప్‌లు సీజ్



ఇసుక నిల్వలు పరిశీలిస్తున్న అధికారులు

**పెబ్బేరు రూరల్:** అత్యంత విశ్వసనీయ సమాచారం మేరకు మండలంలోని రామమ్మపేట, రాంపురం గ్రామాల పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక అక్రమ డంపింగ్ ఉందని తెలియడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం ఆర్డీఓ ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ బృందం దాడి చేసింది. దాదాపు 32 వేల ట్రాక్టర్ల ఇసుక డంప్‌ను గుర్తించినట్లు కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ గురువారం ప్రకటనలో తెలిపారు. డంపింగ్ చేసిన వారి ఆచూకీ కోసం పోలీసులు దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు. నిబంధనలను అతిక్రమించి డంపింగ్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## విద్యుదాఘాతంతో ల్యాబ్ దగ్ధం



విద్యుదాఘాతంతో దగ్ధమైన వంట గది

**మల్దకల్:** విద్యుదాఘాతంతో ల్యాబ్ దగ్ధమై సుమారు రూ.6లక్షల నష్టం సంభవించిన ఘటన గురువారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని కల్యాణ్ ల్యాబ్‌లో ప్రమాదవశాత్తు షాక్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగాయి. ల్యాబ్‌లో పని చేస్తున్న వారు మధ్యాహ్నం భోజనానికి బయటకు వెళ్లిన సమయంలో ఈ ప్రమాదం ఏర్పడింది. దీన్ని గమనించిన చుట్టు పక్కల షాపుల వారు ల్యాబ్ యజమానికి సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న ల్యాబ్ యజమాని గ్రామస్తుల సహకారంతో మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. అప్పటికే మంటలు పూర్తిగా వ్యాపించి, ల్యాబ్‌లోని వస్తువులు మంటల్లో కాలిపోయాయి. ప్రమాదంతో సుమారు రూ.6లక్షల ఆస్తినష్టం ఏర్పడినట్లు ల్యాబ్ యజమాని తెలిపారు.

**కేశ్వాపూర్‌లో వంటగది..**

**కోయిల్‌కొండ:** మండలంలోని కేశ్వాపూర్‌లోని ప్రాథమికోన్నత పాఠశాలలో వంటగది దగ్ధమైన ఘటన బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గ్రామ పంచాయతీ అధికారుల వివరాల ప్రకారం.. పాఠశాలలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో వంటగదిలో మంటలు ఏర్పడడంతో, చుట్టు పక్కల వారు గ్రామ పంచాయతీ అధికారులకు సమాచారం ఇచ్చారు. అంతలోపే రెండు సింగిల్‌ఫేస్ స్టార్టర్లు, కేబుల్స్, నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలు, బెంచీలు, గ్రీన్‌బోర్డ్స్, రెండు పెట్టెలు, ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ. లక్ష వరకు నష్టం ఏర్పడినట్లు మాజీ సర్పంచ్ మొగులయ్య తెలిపారు.

## ఎస్టీ హాస్టల్‌లో విద్యార్థి ఆత్మహత్యాయత్నం



ఖిల్లాఘనపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి దామోదర్

- వైరు తెగడంతో ప్రాణాలతో బయటపడిన విద్యార్థి

**ఖిల్లాఘనపురం:** ఎస్టీ హాస్టల్‌లో 10వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడానికి యత్నించిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. తోటి విద్యార్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఖిల్లాఘనపురం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న ఎస్టీ హాస్టల్‌లో వనపర్తి మండలం చిట్యాలకు చెందిన ఎస్.దామోదర్ 10వ తరగతి చదువుతున్నాడు. గురువారం ఉదయం తరగతులు ప్రారంభమైన తరువాత కొద్ది సేపటికే నోట్‌బుక్ తీసుకోవడానికి విద్యార్థి హాస్టల్ గదికి వచ్చాడు. అక్కడ అనారోగ్యంతో ఉన్న మరో విద్యార్థి బి.దామోదర్‌కు ఏదో పని చెప్పి కిందికి పంపాడు. అంతలోనే వాచ్‌మెన్ రూం వద్ద ఉన్న వైరును తీసుకుని వచ్చి హాస్టల్ గదిలో పైన ఉన్న ఇనుప ఫ్యాన్ కొండికి ఉరేసుకున్నాడు. విద్యార్థి బరువును ఆపలేక వైరు తెగడంతో విద్యార్థి కిందపడిపోయాడు. సమీపంలో 7వ తరగతి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు రాధిక, అక్కడి విద్యార్థులు గమనించి కేకలు వేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు అందరు అక్కడికి చేరుకుని విద్యార్థిని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. డీటీడీఓ, హాస్టల్ వార్డన్ శ్రీదేవిని బుధవారం తిట్టాడని ఆమె ఆస్పత్రిలో చేరిందని విధులకు రాలేదని విద్యార్థులు తెలిపారు. ఉపాధ్యాయులు విషయాన్ని డీటీడీఓ శ్రీనువాసులుకు తెలియజేశారు. ఆయన ఆస్పత్రి వద్దకు వచ్చి విద్యార్థిని పరిశీలించారు. హాస్టల్ వద్దకు వెళ్లి జరిగిన సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చిన విద్యార్థిని గ్రామానికి తీసుకెళ్లారు. ఈ విషయమై వివరణ కోరేందుకు డీటీడీఓ శ్రీనువాసులుకు ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు.

### అటవీ శాఖ పనులు అడ్డగింత

**లింగాల:** మండల పరిధిలోని మల్లొనిచెర్వు తండా అటవీ సమీపంలో అటవీ శాఖ వారు చేపట్టిన కందకాల పనుల విషయంలో అధికారులు, రైతుల మధ్య గురువారం వాగ్వాదం చోటుచేసుకుంది. అధికారులు పొక్లెయిన్‌తో తమ పరిధి ఆక్రమణకు గురికాకుండా చెట్లను తొలగించి కందకాలను తీస్తున్నారు. ఈ క్రమంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ విషయంలో కొంత మంది రైతులు అడ్డు చెప్పడం, తమ భూములను ఆక్రమించుకుంటున్నారని ఆరోపిస్తూ పనులు అడ్డగించారు. దీంతో రైతులు, అధికారుల మధ్య వాగ్వాదం జరుగుతున్న సమయంలో పొక్లెయిన్ అద్దాలను పగలగొట్టారు. పనులు అడ్డగించిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని ఎఫ్ఆర్ఓ వీరేశం తెలియజేశారు.

**మహిళపై కేసు..**

అటవీ శాఖ వారు చేపట్టిన పనులను అడ్డుకున్న సంఘటనకు సంబంధించి ఫిర్యాదు అందినట్లు ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలియజేశారు. జర్పుల బుజ్జిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

### ఎక్సైజ్ అధికారుల దాడులు



**కోడేరు:** మండలంలోని ఒప్పితండా, రేకులపల్లి తండాలో మహబూబ్‌నగర్ ఈఎస్‌టీఎఫ్, నాగర్‌కర్నూల్ డీటీఎఫ్, కొల్లాపూర్ ఎక్సైజ్ అధికారులు గురువారం తండాలో దాడులు నిర్వహించారు. 600 లీటర్ల బెల్లం ఊట, 15 లీటర్ల సారా ధ్వంసం చేసినట్లు సీఐ ఏడుకొండలు తెలిపారు. తండాలో ఎవరైనా సారా కాస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**ఎక్సైజ్ పోలీసుల ఆకస్మిక దాడులు**

**రాజోళి:** మండలంలో ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. గురువారం 'సాక్షి' దినపత్రికలో జోరుగా బెల్టు దందా శీర్షికతో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఎక్సైజ్ పోలీసులు మండలంలో ఆయా గ్రామాల్లో తనిఖీలు, దాడులు చేపట్టారు. మాన్‌దొడ్డిలోని వైన్‌షాపును తనిఖీ చేశారు. ఎస్‌ఐ అనంతరెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు చేస్తున్న క్రమంలో సుంకేసుల డ్యాం సమీపంలో ద్విచక్ర వాహనంపై కాటన్‌తో వెళ్తున్న ఒక వ్యక్తి పోలీసులను చూసి కింద పడేసి పరారయ్యాడు. అనుమానం వచ్చిన పోలీసులు వెళ్లి చూడగా.. అందులో మద్యం బాటిళ్లు ఉన్నాయని, 180 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు. తెలంగాణ నుంచి ఏపీకి ఈ మద్యాన్ని సరఫరా చేస్తున్నట్లుగా పేర్కొన్నారు.

## సింగోటం రామన్న దారుణహత్య

- హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడలో చోటుచేసుకున్న ఘటన
- పాతకక్షలే కారణమని కుటుంబీకుల అనుమానం



సింగోటం రామన్న (ఫైల్)

**కొల్లాపూర్ రూరల్:** నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని సింగోటంకు చెందిన రామన్న (35) హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడలో బుధవారం అర్ధరాత్రి దారుణహత్యకు గురయ్యాడు. పాతకక్షలు మనసులో పెట్టుకున్న ప్రత్యర్థులు రాత్రి 11 గంటల సమయంలో అతనిని దారుణంగా హత్య చేశారు. రామన్న స్వస్థలం సింగోటం కాగా.. తల్లిదండ్రులు నరసింహ్మా, లక్ష్మమ్మతో కలిసి కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. అక్కడే చేపల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించాడు. ఈ క్రమంలోనే రియల్ ఎస్టేట్ వ్యాపారంలోకి దిగాడు. నాలుగేళ్ల క్రితం కాంగ్రెస్ పార్టీలో ఉంటూ కొల్లాపూర్ నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చాడు. అనంతరం అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఏర్పాటు చేసి గ్రామాల్లో మంచినీటి కోసం వాటర్ ప్లాంట్లు, పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం చేస్తూ వచ్చాడు. మత్స్యకార సంఘంలోనూ క్రియాశీలకంగా ఉన్నాడు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

**రామన్న మృతి పార్టీకి తీరని లోటు**

బీజేపీ నాయకుడు సింగోటం రామన్న మృతి పార్టీకి, నియోజకవర్గ ప్రజలకు తీరని లోటు అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. రామన్నను హత్య చేయడం హేయమైన చర్య అన్నారు. నియోజకవర్గంలో రామన్న అబ్దుల్ కలాం ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కొల్లాపూర్‌లో బీజేపీ తరపున క్రియాశీలకంగా పని చేశారన్నారు. ఈ హత్య వెనుక ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఒకవేళ రాజకీయ కోణం ఉంటే మాత్రం పోలీసులు న్యాయమైన విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## భార్యాభర్తల గొడవ.. భార్య మృతి

**గోపాల్‌పేట:** భార్యాభర్తల మధ్య జరిగిన గొడవలో భార్య మృతిచెందిన ఘటన ఏదులలో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల కథనం మేరకు.. ఏదులకు చెందిన ఉప్పరి పర్వతాలుకు తెల్కపల్లి మండలం చిన్న ముద్దునూరుకు చెందిన చెన్నమ్మతో 20 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి కుమార్తె, కుమారుడు ఉండగా హాస్టల్‌లో ఉండి చదువుతున్నారు. ప్రస్తుతం ఇంటి దగ్గర భార్యాభర్తలు మాత్రమే ఉంటున్నారు. బుధవారం అర్ధరాత్రి ఇద్దరు గొడవపడగా.. పర్వతాలు భార్య చెన్నమ్మను తీవ్రంగా కొట్టాడు. ఉదయం గ్రామస్తులతో కలిసి పర్వతాలు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. చెన్నమ్మ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## పార్లమెంట్ స్థానాన్ని బీసీలకు కేటాయించాలి



మాట్లాడుతున్న నడిమింటి శ్రీనివాస్ తదితరులు

**రాజాపూర్:** పార్లమెంట్ వ్యవస్థ ఏర్పడిన తర్వాత 13 సార్లు ఎన్నికలు జరిగితే 10 సార్లు అగ్రకులాల వారికే కేటాయించారని, ఈ సారి మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానాన్ని బీసీలకు కేటాయించాలని నేషనల్ ధోబీ రిజర్వేషన్ సంఘ్ జాతీయ కన్వీనర్ నడిమింటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీలు బీసీలను విస్మరిస్తున్నాయని అన్నారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే ఉపయోగించుకుంటున్న రాజకీయ పార్టీలకు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీసీ అభ్యర్థిని ఖచ్చితంగా బరిలో దింపుతామని అన్నారు. అదేవిధంగా బీసీలకు కార్పొరేషన్ నిధులు కేటాయించి అన్ని వర్గాలకు చేయూతను ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో బీసీ కులగణన చేపడతామన్నందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో చెన్నయ్య, సున్నపు లక్ష్మయ్య, జింకల వెంకటయ్య, సత్యం శేఖర్, యాదయ్య, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### వన్యప్రాణి దాడిలో మృతిచెందిన వ్యక్తి కుటుంబానికి సాయం



పద్మమ్మకు డిడి అందజేస్తున్న డీఎఫ్ఓ రోహిత్ రెడ్డి

**మన్ననూర్:** వన్యప్రాణి బారిన పడి మృతిచెందిన వ్యక్తి కుటుంబానికి అటవీశాఖ తరపున మంజూరైన ఆర్థిక సాయాన్ని డీఎఫ్ఓ రోహిత్‌రెడ్డి చేతులమీదుగా గురువారం అందజేశారు. అమ్రాబాద్ మండలం మాచారానికి చెందిన మద్దెల రామకృష్ణ 2018 సంవత్సరంలో పురుగులగుట్ట సమీపం నుంచి మాచారానికి బైక్‌పై వెళ్తున్నాడు. చుక్కలదుప్పి అడ్డంగా వచ్చి తగిలింది. దీంతో రోడ్డుపై పడిపోయిన అతను అక్కడికక్కడే మృతిచెందాడు. అప్పట్లో ఆర్థికసాయం కోసం బాధిత కుటుంబం అటవీశాఖకు వినతి అందజేశారు. అనివార్య కారణాలతో ఐదేళ్లుగా మరుగున పడిన ఫిర్యాదును డీఎఫ్ఓ ప్రత్యేక చర్యలు తీసుకుని ప్రభుత్వం ద్వార రూ.5 లక్షలు మంజూరు చేయించారు. ఈ క్రమంలో మన్ననూర్ ఎఫ్‌డీఓ కార్యాలయం ఆవరణలో అందుకు సంబంధించిన డిడిని బాధిత మహిళ పద్మమ్మకు అందజేశారు. ఎఫ్‌డీఓ విశాల్, ఎఫ్ఆర్ఓ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

## కోళ్ల పందెం ఆడుతున్న పలువురి అరెస్ట్

**మక్తల్:** కోళ్ల పందెం స్థావరాలపై పోలీసులు గురువారం రాత్రి దాడులు చేశారు. మండలం అనుగొండ శివారులో కోళ్ల పందేలు ఆడుతున్నారని సమాచారం రావడంతో ఎస్‌ఐ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో దాడులు చేశారు. కొందరు పరారయ్యారు. 10 ద్విచక్రవాహనాలు, 10 సెల్ ఫోన్లు, 12 మందిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

### అనుమానాస్పద స్థితిలో ఉరేసుకుని విద్యార్థి మృతి

- హైదరాబాద్‌లో సంఘటన



మహ్మద్ (ఫైల్)

**పెబ్బేరు రూరల్:** అనుమానాస్పద స్థితిలో బీటెక్ విద్యార్థి ఉరేసుకుని మృతిచెందిన ఘటన హైదరాబాద్‌లోని మేడ్చల్ మైసమ్మగూడ మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అయ్యవారిపల్లికి చెందిన బాలెమియా, భార్య నస్రీన్ బేగానికి ఇద్దరు కుమారులు ఉన్నారు. తాను ఆటో నడుపుతూ, భార్య కూలిపని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వీరి పెద్దకుమారుడు రఫీ అపోలో ఫార్మసీలో పని చేస్తున్నాడు. చిన్న కుమారుడు ఎండీ మహ్మద్(21) హైదరాబాద్‌లోని మేడ్చల్, మైసమ్మగూడ మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతూ.. అక్కడే హాస్టల్‌లో ఉంటున్నాడు. ఇతను బుధవారం రాత్రి అనుమానాస్పదంగా కాలేజీ హాస్టల్‌లో ఉరేసుకుని మృతిచెందాడు. ఆ వివరాలను రాత్రి 2 గంటలకు పోలీసులు అయ్యవారిపల్లిలో ఉన్న కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. గురువారం గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనంతరం మృతదేహాన్ని అయ్యవారిపల్లికి తీసుకొచ్చారు.

### మహిళకు తీవ్రగాయాలు

**పెబ్బేరు రూరల్:** బైక్‌పై వెళ్తున్న ఇద్దరిని వెనుక నుంచి లారీ ఢీకొట్టడడంతో మహిళకు తీవ్రగాయాలై, మరొకరికి స్వల్ప గాయాలైన ఘటన వనపర్తి పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. వనపర్తి పట్టణ ఎస్‌ఐ జయన్న వివరాల ప్రకారం.. వీపనగండ్ల మండలానికి చెందిన నాగరాణి వనపర్తి పట్టణంలోని రాయిగడ్డ కాలనీలో నివాసం ఉంటున్న మరిది శ్రీనువాసులు ఇంటికి వచ్చింది. గురువారం వీపనగండ్లకు వెళ్లడానికి మరిది బైక్‌పై బస్టాండ్‌కు తీసుకెళ్తుండగా పట్టణంలోని పాలిటెక్నిక్ ముందు బైక్‌ను లారీ ఢీకొట్టింది. దీంతో లారీ టైరుకింద ఆమె కాళ్లు పడడంతో రెండు విరిగి పోయాయి. ఆమె మరిదికి స్వల్పగాయాలు కాగా స్థానికులు వారిని ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వారిని హైదరాబాద్‌కు తరలించారు. శ్రీనివాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

# దొరికారు దొంగలు


## ఏ-1 చంద్రబాబు, ఏ-2 నారాయణ, ఏ-3 లింగమనేని, ఏ-14 లోకేశ్

**సాక్షి, అమరావతి:** టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు యథేచ్ఛగా సాగించిన కుంభకోణాలపై సీఐడీ దూకుడు పెంచింది. ఇన్నర్ రింగ్ రోడ్ కేసులో విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో గురువారం చార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఈ కేసులో ఏ-1గా చంద్రబాబు, ఏ-2గా పొంగూరి నారాయణలను పేర్కొంది. లింగమనేని కుటుంబంతో కలిసి సాగించిన ఈ క్విడ్ ప్రో కో కుంభకోణంలో హెరిటేజ్ ఫుడ్స్ డైరెక్టర్‌గా వ్యవహరించిన నారా లోకేశ్‌ను ఏ-14గా, లింగమనేని రమేశ్ తదితరులను కూడా నిందితులుగా పేర్కొంది. వారిపై ఐపీసీ 120(బి), 409, 420, 34, 35, 37.. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 13(2), రెడ్‌విత్ 13(1)(సి),(డి)ల ప్రకారం వారిపై కేసు నమోదు చేసినట్టు ఆ చార్జ్‌షీట్‌లో వెల్లడించింది.తద్వారా ఈ భారీ భూ కుంభకోణంపై న్యాయ విచారణ ప్రక్రియకు రంగం సిద్ధమైంది. కాగితాల మీదే ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో ఇష్టానుసారం మార్పులు చేసి, వేల కోట్ల రూపాయలు కొల్లగొట్టిన చంద్రబాబు ముఠా అవినీతి బాగోతం విభ్రాంతి పరుస్తోంది. టీడీపీ ప్రభుత్వంలో సీఆర్‌డీఏ చైర్మన్‌గా అప్పటి సీఎం చంద్రబాబు, వైస్ చైర్మన్‌గా అప్పటి మంత్రి పొంగూరు నారాయణ బరితెగించి ఇలా అవినీతికి పాల్పడ్డారు. ఇందుకోసం లింగమనేని రమేశ్‌తో క్విడ్ ప్రో కో కు తెరలేపారు. ఈ తతంగంలో నారా లోకేశ్ కూడా ప్రధాన పాత్ర పోషించారు. చంద్రబాబు బినామీ, సన్నిహితుడు లింగమనేని భూముల మార్కెట్ విలువ రూ.177.50 కోట్ల నుంచి రూ.877.50 కోట్లకు.. రాజధాని నిర్మాణం అనంతరం ఏకంగా రూ.2,130 కోట్లకు చేరేలా ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్‌ను ఖరారు చేయడం భారీ దోపిడీకి నిదర్శనం.

### సింగపూర్ కన్సల్టెన్సీ ముసుగు

సింగపూర్‌కు చెందిన సుర్బాన జ్యురాంగ్ కన్సల్టెన్సీ ముసుగులో చంద్రబాబు ముఠా ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ పేరిట భూ దోపిడీకి పాల్పడింది. సీఆర్‌డీయే ఏకంగా సింగపూర్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నట్టుగా టీడీపీ ప్రభుత్వం భ్రమింపజేసింది. కానీ ఆ పేరుతో సింగపూర్‌లోని ప్రైవేట్ కన్సల్టెన్సీ సుర్బాన జ్యురాంగ్ కన్సల్టెన్సీని తీసుకువచ్చి పక్కాగా అవినీతి కథ నడిపించింది. అమరావతిలో ఇన్నర్ రింగ్ రోడ్ కోసం సీఆర్‌డీయే అధికారులు 94 కిలోమీటర్ల పొడవుతో అలైన్‌మెంట్ రూపొందించారు. ఆ ప్రకారం అమరావతిలోని చంద్రబాబు, లింగమనేని, నారాయణ కుటుంబాలకు చెందిన భూములకు 3 కిలోమీటర్ల దూరం నుంచి పెద్దపరిమి, నిడమర్రు, చిన వడ్లపూడి, పెద వడ్లపూడి మీదుగా ఇన్నర్ రింగ్ రోడ్ నిర్మించాలి. దాంతో తమ భూముల విలువ పెరగదని గ్రహించిన చంద్రబాబు, నారాయణ.. సీఆర్‌డీయే అధికారులపై మండిపడ్డారు. వారిద్దరి ఆదేశాలతో సీఆర్‌డీయే అధికారులు ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పులు చేశారు. అలైన్‌మెంట్‌ను 3 కిలోమీటర్లు దక్షిణానికి జరిపి.. తాడికొండ, కంతేరు, కాజాలలోని చంద్రబాబు, లింగమనేని కుటుంబాలకు చెందిన 355 ఎకరాలు, హెరిటేజ్ ఫుడ్స్‌కు చెందిన 13 ఎకరాలను ఆనుకుని నిర్మించేలా ఖరారు చేశారు. ఆ విషయాన్ని గోప్యంగా ఉంచి.. చంద్రబాబు, నారాయణ తమ కుటుంబ సంస్థలు హెరిటేజ్, రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్‌లతోపాటు తమ బినామీ లింగమనేని రమేశ్ సంస్థల పేరిట ఇన్నర్ రింగ్ రోడ్డుకు అటూ ఇటూ భారీగా భూములు కొన్నారు. అనంతరం సింగపూర్‌కు చెందిన సుర్బాన జ్యురాంగ్ కన్సల్టెన్సీని రంగంలోకి తెచ్చారు. అప్పటికే ఖరారు చేసిన ఇన్నర్ రింగ్ రోడ్ డిజైన్‌ను అమరావతి మాస్టర్ ప్లాన్‌లో చేర్చారు. అనంతరం ఎస్టీయూపీ అనే కన్సల్టెన్సీని నియమించారు. కానీ మాస్టర్ ప్లాన్‌లో పొందుపరిచిన అలైన్‌మెంట్‌కు అనుగుణంగానే ఉండాలని షరతు విధించారు. అంటే అప్పటికే సీఆర్‌డీయే అధికారుల ద్వారా తాము ఖరారు చేసిన అలైన్‌మెంట్‌నే ఎస్టీయూపీ కన్సల్టెన్సీ ద్వారా ఆమోదించేలా చేశారు.

- ఐఆర్ఆర్ కుంభకోణం కేసులో సీఐడీ దూకుడు
- ఏసీబీ న్యాయ స్థానంలో చార్జ్‌షీట్ దాఖలు
- కన్సల్టెన్సీ ముసుగులో భూ దోపిడీ
- తద్వారా పచ్చ ముఠా భూముల విలువ అమాంతం పెంపు
- రూ.2 వేల కోట్లకుపైగా దోపిడీ



### ఇదిగో అడ్డగోలు దోపిడీ ఇలా..

- ఐఆర్ఆర్ అలైన్‌మెంట్ కుంభకోణం ద్వారా చంద్రబాబు ముఠా లింగమనేని కుటుంబంతో క్విడ్ ప్రో కోకు పాల్పడింది. లింగమనేని కుటుంబానికి కల్పించిన ప్రయోజనానికి ప్రతిగా చంద్రబాబు తమ హెరిటేజ్ ఫుడ్స్‌కు భూములు పొందారు. ఈ ప్రక్రియలో అప్పటి హెరిటేజ్ ఫుడ్స్ డైరెక్టర్ హోదాలో లోకేశ్ కీలక భూమిక పోషించారు. ఐఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను ఆనుకుని ఉన్న కంతేరు గ్రామంలో హెరిటేజ్ ఫుడ్స్‌కు 10.4 ఎకరాలు పొందారు.
- 2014 జూన్ – సెప్టెంబర్ మధ్య ఈ భూములను హెరిటేజ్ ఫుడ్స్ కొనుగోలు చేసినట్టు చూపించారు. అంతే కాకుండా లింగమనేని కుటుంబం నుంచి మరో 4.55 ఎకరాలు కొనుగోలు పేరిట హెరిటేజ్ ఫుడ్స్ దక్కించుకుంది. కానీ అప్పటికే ఈ కుంభకోణం గురించి బయటకు పొక్కడంతో ఆ సేల్ డీడ్‌ను రద్దు చేసుకున్నారు. ఐఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను ఆనుకుని లింగమనేని కుటుంబానికి చెందిన 355 ఎకరాలతోపాటు హెరిటేజ్ ఫుడ్స్ భూములు ఉండటం గమనార్హం.
- క్విడ్ ప్రో కో లో భాగంగా లింగమనేని రమేశ్ కృష్ణా నది కరకట్ట మీద ఉన్న తమ బంగ్లాను చంద్రబాబుకు ఇచ్చారు. దీనిపై కేసు నమోదు కావడంతో ఈ వ్యవహారానికి మసి పూసేందుకు చేసిన యత్నాలు బెడిసికొట్టాయి. ఆ బంగ్లాను అద్దెకు ఇచ్చానని లింగమనేని రమేశ్ చెప్పారు. కానీ ఆయన అద్దె వసూలు చేసినట్టుగానీ, చంద్రబాబు చెల్లించినట్టుగానీ ఆదాయ పన్ను వివరాల్లో లేవు.
- తర్వాత ఆ ఇంటిని ప్రభుత్వానికి ఉచితంగా ఇచ్చానని చెప్పారు. మరి అప్పటి ప్రభుత్వం నుంచి చంద్రబాబు హెచ్ఆర్ఏ ఎందుకు పొందారని ప్రశ్నించేసరికి ఆయన వద్ద నుంచి జవాబే లేదు. దాంతో ఆ బంగ్లాను చంద్రబాబుకు వ్యక్తిగతంగా క్విడ్ ప్రో కో కింద ఇచ్చారన్నది స్పష్టమైంది.

> **లోకేశ్ అరెస్ట్‌కు ప్రతిబంధకం కాదు**
>
> ఐఆర్ఆర్ కేసులో సీఐడీ చార్జ్‌షీట్ దాఖలు ఇప్పటికే విచారణలో ఉన్న 'రెడ్‌బుక్' కేసును ప్రభావితం చేయదని నిపుణులు చెబుతున్నారు. ఐఆర్ఆర్ కుంభకోణం కేసు, రెడ్‌బుక్ బెదిరింపులు వేర్వేరు కేసులు. కాబట్టి ఐఆర్ఆర్ కేసులో చార్జ్‌షీట్ దాఖలు చేసినప్పటికీ రెడ్‌బుక్ పేరిట బెదిరింపు కేసులో లోకేశ్‌ను అరెస్ట్ చేసేందుకు ఎలాంటి అడ్డంకి ఉండదని నిపుణులు స్పష్టం చేశారు.

### మ్యాప్‌ను చుట్టూ తిప్పేశారు..

- లింగమనేని కుటుంబంతో క్విడ్ ప్రో కో ద్వారా పొంగూరు నారాయణ.. తమ బంధువులు, బినామీల పేరిట 58 ఎకరాలు పొందారు. చంద్రబాబు, నారాయణ కుటుంబాలు అక్రమంగా దక్కించుకున్న భూముల సమీపంలోనే ప్రభుత్వ నిధులతో సీడ్ క్యాపిటల్ ఏరియా, స్టార్టప్ ఏరియాను అభివృద్ధి చేయాలని టీడీపీ ప్రభుత్వం ప్రణాళికను ఆమోదించింది. అందుకోసం ఏకంగా ప్రభుత్వ నిధులు రూ.5,500 కోట్లు వెచ్చించాలని నిర్ణయించింది. తద్వారా తమ భూముల ధరలు అమాంతం పెరిగేలా చేసేందుకు కుట్ర పన్నింది.
- సీఆర్‌డీఏ అధికారులు మొదట రూపొందించిన అలైన్‌మెంట్ ప్రకారం గుంటూరు జిల్లాలోని నూతక్కి – కృష్ణా జిల్లా పెద్దపులిపర్రు మధ్య కృష్ణా నదిపై వంతెన నిర్మించాలి. అక్కడి నుంచి తాడిగడప – ఎనికేపాడు మీదుగా నున్న వరకు ఇన్నర్ రింగ్ రోడ్డు కొనసాగుతుంది. అలా నిర్మిస్తే ఆ ప్రాంతంలోని నారాయణ విద్యా సంస్థల భవనాలను భూ సేకరణ కింద తొలగించాల్సి వస్తుంది. దాంతో నారాయణ ఆదేశాలతో ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను 3 కి.మీ. తూర్పు దిశగా మార్చారు.
- ఆ ప్రకారం గుంటూరు జిల్లాలో రామచంద్రాపురం – కృష్ణా జిల్లా చోడవరం మధ్య వంతెన నిర్మించాలని నిర్ణయించారు. అక్కడి నుంచి పెనమలూరు మీదుగా నిడమానూరు నుంచి నున్న వరకు ఇన్నర్ రింగ్ రోడ్డును నిర్మిస్తారు. దాంతో నారాయణ కుటుంబానికి చెందిన 9 విద్యా సంస్థల భవనాలను ఆనుకుని ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు.

### పవన్ కళ్యాణ్‌కూ 2.40 ఎకరాల ప్యాకేజీ

జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు కూడా ఈ ఇన్నర్ రింగ్ రోడ్డు అవినీతి పాపంలో పిడికెడు వాటా ఇచ్చారు. ఈ రోడ్డు అలైన్‌మెంట్‌కు సమీపంలోనే ఆయనకు 2.4 ఎకరాల భూమి ఉంది. లింగమనేని కుటుంబం నుంచి ఆ భూములను ప్రభుత్వ ధర ప్రకారం ఎకరా రూ.8 లక్షలు చొప్పున కొనుగోలు చేసినట్టు చూపించారు. ల్యాండ్ పూలింగ్ నుంచి మినహాయింపు కల్పించిన భూమినే పవన్ కళ్యాణ్‌కు ఇవ్వడం గమనార్హం.

**ఐఆర్ఆర్ కేసులో నిందితులు**

ఏ-1: చంద్రబాబు, ఏ-2: నారాయణ, ఏ-3: లింగమనేని రమేశ్
ఏ-4: లింగమనేని వెంకట సూర్య రాజశేఖర్
ఏ-5: కేపీవీ అంజని కుమార్ (రామకృష్ణ హౌసింగ్ కార్పొరేషన్)
ఏ-6: హెరిటేజ్ ఫుడ్స్, ఏ-7: ఎల్ఈపీఎల్ ప్రాజెక్ట్స్, ఏ-14: లోకేశ్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలుపుతున్న వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావు, మేడా రఘునాథరెడ్డి

## వైఎస్సార్‌సీపీ రాజ్యసభ అభ్యర్థులు ఖరారు

- అభ్యర్థులుగా గొల్ల బాబూరావు, వైవీ సుబ్బారెడ్డి, మేడా రఘునాథ రెడ్డి

**సాక్షి,అమరావతి:** వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ రాజ్యసభ అభ్యర్థులను గురువారం ఖరారు చేశారు. పార్టీ అభ్యర్థులుగా గొల్ల బాబూరావు, మేడా రఘునాథరెడ్డి, వైవీ సుబ్బారెడ్డిని ఎంపిక చేశారు. ముగ్గురు అభ్యర్థులను సీఎం జగన్ అభినందించారు. గురువారం అసెంబ్లీలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో ముగ్గురు అభ్యర్థులు సీఎం జగన్‌ను కలిశారు. తమకు రాజ్యసభ అభ్యర్థులుగా అవకాశం కల్పించినందుకు వారు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## సీ-ఓటర్ నేతి బీర సర్వే

- 2019లోనూ ఇదే రీతిలో సర్వే.. తప్పిన లెక్కలు
- గత ఎన్నికల్లో చారిత్రక విజయం సాధించిన వైఎస్సార్‌సీపీ
- తాజాగా ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లోనూ సీ-ఓటర్ అంచనాలు గల్లంతు
- ప్రజల నాడి పట్టలేక విశ్వసనీయత కోల్పోయిన సర్వే సంస్థ

**సాక్షి, అమరావతి:** ప్రజల మనోగతం పేరుతో సీ-ఓటర్ సంస్థ నిర్వహిస్తున్న సర్వేలకు ఏమాత్రం విశ్వసనీయత లేదనేందుకు ఇటీవల జరిగిన పలు రాష్ట్రాల ఎన్నికలతోపాటు 2019 ఎన్నికల్లో ఆ సంస్థ లెక్కలు తప్పడమే నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు ఉదహరిస్తున్నారు. గత నవంబర్‌లో మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు జరిగిన ఎన్నికల్లో సీ-ఓటర్ అంచనాలు గల్లంతయ్యాయి. టైమ్స్ నౌ లాంటి దజునుకుపైగా జాతీయ మీడియా సంస్థలు నిర్వహించిన సర్వేలు రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడం తథ్యమని, టీడీపీ ఉనికి కోల్పోవడం ఖాయమని ఇప్పటికే వెల్లడించాయి. ఎలాంటి విశ్వసనీయత లేని సీ-ఓటర్ మాత్రం తనకు అలవాటైన రీతిలో సర్వే చేసినట్లు పేర్కొనగా దాన్ని పట్టుకుని టీడీపీ, ఎల్లో మీడియా చంకలు గుద్దుకోవడంపై విస్మయం వ్యక్తమవుతోంది. కోతికి కొబ్బరి చిప్ప మాదిరిగా సీ-ఓటర్ సర్వే పేరుతో హడావుడికి తెర తీశారని పేర్కొంటున్నారు. 2019లో ఎన్నికల్లో టీడీపీ 14 లోక్‌సభ, 90–100 శాసనసభ స్థానాల్లో విజయం సాధిస్తుందని తన సర్వేలో వెల్లడైనట్లు సీ-ఓటర్ ప్రకటించింది. చివరకు ఫలితాలను చూస్తే 151 శాసనసభ, 22 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ చారిత్రక విజయాన్ని నమోదు చేయగా టీడీపీ 23 శాసనసభ, 3 ఎంపీ స్థానాలకే పరిమితమైంది.

**చెప్పిందంటే.. జరగదంతే!**

దేశంలో ఇప్పటిదాకా జరిగిన అధిక శాతం ఎన్నికల్లో సీ-ఓటర్ నిర్వహించిన ప్రీ-పోల్, ఎగ్జిట్ పోల్ సర్వేలు లెక్కలు తప్పాయి. ఏదైనా ఓ పార్టీ అధికారంలోకి వస్తుందని సీ-ఓటర్ తేల్చిందంటే కచ్చితంగా మరో పార్టీనే అధికారంలోకి వస్తుందని పలు సందర్భాల్లో రుజువు కావటాన్ని బట్టి ఆ సంస్థ విశ్వసనీయత ఎంతన్నది వెల్లడవుతోంది.

**ఇదీ.. 'సీ ఓటర్' విశ్వసనీయత!**

| ఏ ఎన్నిక? | సీ ఓటర్ అంచనా/ సీట్లు | ఎన్ని సీట్లు వచ్చాయి? | అంతిమ విజేత/సీట్లు |
|---|---|---|---|
| 2019 ఎన్నికలు | టీడీపీ 14 ఎంపీ, 90–100 అసెంబ్లీ | 3 ఎంపీ, 23 అసెంబ్లీ | వైఎస్సార్ సీపీ 22 ఎంపీ, 151 అసెంబ్లీ |
| మధ్యప్రదేశ్ 2023 నవంబర్ | కాంగ్రెస్ 118 – 130 (ప్రీ పోల్) కాంగ్రెస్ 113 -137 (ఎగ్జిట్ పోల్) | కాంగ్రెస్ (66) | బీజేపీ (163) |
| ఛత్తీస్‌గఢ్ 2023 నవంబర్ | కాంగ్రెస్ 45-51(ప్రీ పోల్) కాంగ్రెస్ 41-53 (ఎగ్జిట్ పోల్) | కాంగ్రెస్ (35) | బీజేపీ (54) |



# కుదిరిన ముహూర్తం

- వరుసగా మూడు నెలలు మోగనున్న భాజాలు

**దేవరకద్ర:** మాఘ మాసం ప్రారంభం కానుండటంతో పెళ్లిళ్లకు మంచి ముహూర్తాలు ఉన్నాయని బ్రాహ్మణులు తెలియజేస్తున్నారు. ఈ ఏడాది వరుసగా మూడు నెలల పాటు పెళ్లి భాజాలు మోగనున్నాయి. గతంలో గురుమౌఢ్యమి, శుక్రమౌఢ్యమి అంటూ పెళ్లిళ్లకు ఉన్న అడ్డంకులు ఈ ఏడాది లేకపోవడంతో ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ మాసాల్లో మంచి ముహూర్తాలు కుదరడంతో కొత్త జంటలను ఒకటి చేసేందుకు పెద్దలు ఇప్పటి నుంచే హడావుడి చేస్తున్నారు.

> **వివాహ శుభకార్యాలకు మంచి రోజులు..**
>
> మాఘ మాసం అంటేనే పెళ్లిల్లు, పందిళ్లతో సందడి వాతావరణం కనిపిస్తుంది. పట్టణాలు, పల్లెలతో మొదలుకొని ఫంక్షన్ హాళ్లు, రిసార్టులు, గార్డెన్లన్ని కళకళలాడానున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి రెండో వారం నుంచి వరుసగా మూడు నెలల పాటు ఏప్రిల్ చివరి వరకు వివాహాది శుభకార్యాలకు దివ్యమైన ముహూర్తాలు ఉన్నాయి. ఎలాంటి మౌఢ్యమీలు లేకపోవడంతో పాటు బాగా కుదిరిన ముహూర్తాలతో పెళ్లిల్లు ఇతర శుభకార్యాలను నిర్విఘ్నంగా చేసుకోవచ్చు.
>
> – జోషి రామాచారి, ప్రముఖ పండితులు, దేవరకద్ర

**పెళ్లి ముహూర్తాలు ఇలా..**

- ఫిబ్రవరి 13, 14, 17, 18, 24, 28, 29న మంచి ముహూర్తాలు ఉన్నాయి.
- మార్చి 2, 3, 15, 17, 20, 22, 24, 25, 27, 28, 30 తేదీల్లో మంచిగా ఉన్నట్లు పండితులు తెలుపుతున్నారు.
- ఏప్రిల్ 3, 4, 9, 18, 19, 20, 21, 22, 24, 26 తేదీలు బాగున్నట్లు తెలిపారు. ఇలా వరుస పెళ్లిల్లు ఉండటంతో ఫంక్షన్ హాళ్లు, గార్డెన్లు, రిసార్టులు ఇప్పటి నుంచి బుక్ చేసుకుంటున్నారు.

# ఆలోచనలకు పదును



ఔషధ మొక్కలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు

- వెన్నాచేడ్ మోడల్ స్కూల్‌లో ఇంటర్ విద్యార్థులకు 'అంకురం' శిక్షణ
- యువ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- తెలంగాణ ఉద్యమ్ శిక్షణ్, ఇన్‌క్విలాబ్ ఫౌండేషన్ సహకారంతో..

**గండేడ్:** విద్యార్థులను యువ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు విద్యాశాఖ కృషి చేస్తోంది. ఇందులో భాగంగా మండలంలోని వెన్నాచేడ్ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు తెలంగాణ ఉద్యమ్ శిక్షణ్, ఇన్‌క్విలాబ్ ఫౌండేషన్ సహకారంతో 'అంకురం' పేరుతో బిజినెస్ ఇన్నోవేటర్స్ కార్యక్రమంలో భాగంగా శిక్షణనిస్తున్నారు. అయిదు నెలల కిందట హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కళాశాల నుంచి నాలుగు బృందాలు (ఒక్కో బృందంలో ఎనిమిది మంది విద్యార్థుల చొప్పున) తమ ఆలోచనతో ప్రాజెక్టులు తయారుచేసి ప్రదర్శించారు. అందులో స్మార్ట్‌కీ తయారీ, ఔషధ మొక్కలు, తక్కువ ఖర్చుతో అలంకరణ, స్థానికంగా దొరికే మట్టిలో ఏకో ఫ్రెండ్లీ వస్తువులు ఉన్నాయి. వీటి తయారీకి సంబంధించి ఆర్థిక సాయాన్ని ఆయా సంస్థలు అందిస్తుండగా.. విద్యార్థులు యూనిట్లను తయారు చేసి విక్రయిస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు రూ.లక్ష వరకు ఆర్థిక సాయం అందినట్లు విద్యార్థులు తెలిపారు. తాము తయారుచేసిన వస్తువుల్లో చాలావరకు విక్రయించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు ప్రిన్సిపాల్ కొండల్‌రావుతో పాటు నాగరత్న, గోపీనాథ్ ప్రోత్సహిస్తున్నారు.

**ఔషధ మొక్కలతో సంపూర్ణ ఆరోగ్యం..**

ప్రస్తుతం మార్కెట్‌లో కొన్ని ఔషధ మొక్కలు అధిక ధరలకు లభిస్తుండగా.. మరికొన్ని అందుబాటులో కూడా ఉండవు. కాని అంకురం కింద ఏ ఔషధమొక్క అయినా ఇక్కడ లభించేలా ఏర్పాటు చేశారు. ఇన్సూలిన్, అశ్వగంధ, ఇండిగో, లవంగ తులసి, కీళ్లనొప్పులు, గాలిని శుద్ధి చేసే మొక్కలు, లెమన్ గ్రాస్, మింట్ తదితర మొక్కలు ఉన్నాయి. వీటి ఔషధ గుణాలను వివరించి విక్రయిస్తున్నారు. బయటి మార్కెట్లో రూ.500 నుంచి రూ.2,500 వరకు ధర ఉన్న మొక్కలను కేవలం రూ.100కే విద్యార్థులు అందజేస్తున్నారు.

**అలంకరణలో..**

ప్రస్తుతం పెళ్లిళ్లలో పెళ్లి కుమార్తె, కుమారుడి ముస్తాబు తప్పనిసరి అయింది. మోడల్ స్కూల్ విద్యార్థులు అతి తక్కువ ఖర్చుతో మార్కెట్ రేటు కంటే 40 శాతం తక్కువతో చేస్తున్నారు. చేతులకు గోరింటాకు పెట్టడానికి రూ.30 తీసుకుంటున్నారు. పెళ్లి కుమారుడు, కుమార్తెతో పాటు పెళ్లికి హాజరయ్యే వారిని కూడా అందంగా ముస్తాబు చేస్తున్నారు. అలాగే స్టేజీల అలంకరణ కూడా చేస్తున్నారు. పర్యావరణానికి ముప్పు వాటించని, మట్టిలో కలిసిపోయే స్థానికంగా లభించే వస్తువులనే అలంకరణకు వినియోగిస్తారు. వీటితో పాటు జనుపనార తాడుతో అలంకరణ వస్తువులు, వెదురు కట్టెలతో ట్రేలు, బుట్టలు, చాటలు, కొబ్బరి చిప్పలతో టీ కప్పులు, తాళాలను భద్రపర్చే ట్రేలు తదితరవి తయారు చేస్తున్నారు. అలాగే కాటన్ దుస్తులు, దుప్పట్లు, జంకానాలు నేరుగా సోలాపూర్ నుంచి తెప్పించి ట్రాన్స్‌పోర్టు చార్జీలు మాత్రమే తీసుకొని విక్రయిస్తున్నారు. సుమారు అయిదు నెలలుగా ఆయా కార్యక్రమాలు నిర్వహిస్తూ వ్యాపార మెళకువలతో పాటు ఇతర అంశాలను నేర్చుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఏదేమైనా గ్రామీణులకు తక్కువ ఖర్చుతో అన్నిరకాల సేవలు అందుబాటులోకి తీసుకొస్తుండటంతో పలువురు ప్రశంసిస్తున్నారు

> **స్మార్ట్‌కీలతో ప్రమాదాల నివారణ..**
>
> నేడు ప్రతి ఇంట్లో వంట గ్యాస్ సిలిండర్ వినియోగిస్తారు. గ్యాస్ లీకైనప్పుడు ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ముందే గుర్తించేందుకు స్మార్ట్‌కీను రూపొందించారు. ఈ యంత్రాన్ని సిలిండర్‌కు బిగించాలి. గ్యాస్ లీకై నప్పుడు వచ్చే వాసనను సెన్సార్ గుర్తించి అలారం మోగుతుంది. ఇంట్లో ఎవరూ లేకున్నా పక్క వారు గుర్తించి ప్రమాదం జరగకుండా నివారించవచ్చు. దీని తయారీకి రూ.800 వరకు ఖర్చవుతుందని విద్యార్థులు తెలిపారు.
>
> - అలాగే బైక్, కారు కోసం కూడా స్మార్ట్ కీలను తయారు చేస్తున్నారు. కీ ఎక్కడైనా మర్చిపోతే బజర్ వచ్చేలా దీనిని రూపొందించారు. పైథాన్ లాంగ్వేజ్‌తో సెల్‌ఫోన్‌కు అనుసంధానించి ఒక కోడ్ ఇస్తారు. దానిని నొక్కగానే బజర్ వచ్చి కీ ఎక్కడుందో తెలిసిపోతుంది.

> **విద్యార్థుల ఆలోచనలకు సహకారం..**
>
> 
>
> విద్యార్థుల ఆలోచనలకు అనుగుణంగా వారిని ప్రోత్సహిస్తూ సహకారం అందిస్తున్నాం. జిల్లాలో మా పాఠశాల అంకురం కార్యక్రమానికి ఎంపికకావడం సంతోషంగా ఉంది. వారి సహకారంతో విద్యార్థులకు వ్యాపార మెళకువలతో పాటు విలువైన వాటి గురించి తెలియజెప్పే అవకాశం లభించింది.
>
> – కొండల్‌రావు, ప్రిన్సిపాల్, మోడల్ స్కూల్, వెన్నాచేడ్



విద్యార్థులను అలంకరిస్తూ..



ఎకో ఫ్రెండ్లీ వస్తువులతో విద్యార్థులు

## అభయుడికి నెమలి వాహన సేవ



స్వామివారికి నెమలి వాహన సేవ నిర్వహిస్తున్న భక్తులు

**ఊర్కొండ:** మండలంలోని ఊర్కొండపేటలో వెలసిన అభయాంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి నెమలి వాహన సేవ నిర్వహించారు. అలాగే ఉదయం ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర పూజలు జరిపారు. ఉత్సవాల నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి వివిధ గ్రామాల భజన మండళ్లచే భజనలు కొనసాగాయి. అలాగే ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి దేవస్థానానికి ఆలయ మాజీ చైర్మన్ బెక్కరి రాజశేఖర్, సునీత దంపతులు అన్నదానం నిమిత్తం రూ.లక్ష చెక్కును ఈఓ సత్యచంద్రారెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ అర్చకులు ప్రవీణ్, దత్తాత్రేయ శర్మ, శ్రీనివాస శర్మ, మఠం మహేష్, శివ భక్తులు అశోక్‌రెడ్డి, అరవింద్, సురేష్, శంకర్, రాము తదితరులు పాల్గొన్నారు.



ఆలయ ఈఓకు రూ.లక్ష చెక్కు అందజేస్తున్న మాజీ చైర్మన్ దంపతులు

## చెన్నకేశవస్వామి ఆలయ హుండీ లెక్కింపు



ఎన్నికైన పాలకమండలి సభ్యులు

**జడ్చర్ల టౌన్:** మండలంలోని గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ హుండీని గురువారం లెక్కించగా రూ.5,24,020 ఆదాయం సమకూర్చినట్లు కార్యనిర్వహణ అధికారి దీప్తిరెడ్డి తెలిపారు. కార్తీక మాసం నుంచి ఫిబ్రవరి 7 వరకు హుండీ లెక్కించినట్లు వివరించారు.

**పాలకమండలి ప్రమాణ స్వీకారం..**

గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ పాలక మండలి కార్యవర్గం గురువారం ఆలయ ప్రాంగణంలో ప్రమాణ స్వీకారం చేశారు. సభ్యులుగా జనార్దన్‌రెడ్డి, చెన్నయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రామచంద్రయ్య, రాఘవరెడ్డి, చెన్నమ్మ, శ్రీనివాస్‌యాదవ్, కుంభ శ్రీనివాస్, నోముల శంకర్, బండారు శ్రీను, గంధం విశ్వం, సి.రామచంద్రయ్యతో ఆలయ కార్యనిర్వహణ అధికారి దీప్తిరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని వసతులు కల్పించాలని పాలకమండలి నిర్ణయించింది.

## రామన్‌పాడును సందర్శించిన మత్స్యశాఖ కమిషనర్

**మదనాపురం:** మండలంలోని రామన్‌పాడు జలాశయాన్ని గురువారం మత్స్యశాఖ కమిషనర్ డా. బి.గోపి, కలెక్టర్ తేజస్ పవర్ సందర్శించారు. ఈ ప్రాంతంలో మత్స్యబీజ క్షేత్రం ఏర్పాటుకు వసతులు పరిశీలించారు. ఎంతమేర ప్రభుత్వ భూమి ఉంది.. నీటి లభ్యత, రహదారి సౌకర్యం తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. పూర్తి వివరాలతో ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు కమిషనర్ తెలిపారు. వారి వెంట మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు, ఏడీ భూసర్వే, రికార్డు చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయ అధికారి, డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ వెంకట్రాంరెడ్డి, డీఈఈ జగన్మోహన్‌రెడ్డి, విద్యాసాగర్, మత్స్యశాఖ ఏడీ రహమాన్, ఏఈ రనీల్‌రెడ్డి పాల్గొన్నారు.



రామన్‌పాడు జలాశయం వద్ద మత్స్యశాఖ కమిషనర్ డా. బి.గోపి, కలెక్టర్ తేజస్ పవార్